# అట్టహాసంగా ప్రాపర్టీ షో

- తరలివచ్చిన బిల్డర్స్, రియల్ ఎస్టేట్ కంపెనీలు
- రుణ సదుపాయం కల్పించడానికి సిద్ధంగా బ్యాంకర్లు
- ప్రదర్శనలో 23 స్టాళ్ల ఏర్పాటు.. సాయంత్రం వరకు సందర్శకుల తాకిడి
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే అద్భుత ఆవిష్కరణ: జడ్పీ చైర్మన్ విఠల్‌రావు
- నేడు కూడా కొనసాగనున్న ప్రాపర్టీ షో

ప్రైమ్ ఎస్టేట్స్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తూ..

కస్టమర్లకు వివరాలు చెబుతున్న ఓ కంపెనీ ప్రతినిధి

ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నమస్తే తెలంగాణ ప్రకటనల విభాగం జనరల్ మేనేజర్ సురేందర్‌రావు తదితరులు

స్టాళ్ల వద్ద సందర్శకులు

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ప్రారంభం

ఖలీల్‌వాడి, మార్చి 22: నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేసిన ఈ షోను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రారంభించారు. ప్రాపర్టీ షోలో నిజామాబాద్, హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ రంగ కంపెనీలు పాల్గొనగా.. 23 స్టాళ్లను ఏర్పాటు చేశారు. వివిధ స్టాళ్లను ఉదయం నుంచి సాయంత్రం వరకు సందర్శకులు సందర్శించి ఆయా నిర్మాణ రంగ ప్రాజెక్టులను ఆసక్తిగా అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ ప్రకటనల విభాగం జనరల్ మేనేజర్ ఎన్.సురేందర్ రావు, యూబీఐ రీజినల్ హెడ్ శంకర్ ఎబ్రామ్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎం. శ్రీకాంత్, 'నమస్తే' బ్రాంచ్ మేనేజర్ గడ్డి ధర్మరాజు, బ్యూరో చీఫ్ జూపల్లి రమేశ్, ప్రకటనల విభాగం మేనేజర్ కడారి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

### సొంతింటి కల సాకారం:
**జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు**

సొంతింటి కలను సాకారం చేయడానికే నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో ఏర్పాటు చేశారని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. హైదరాబాద్, నిజామాబాద్‌కు చెందిన బిల్డర్స్, రియల్ ఎస్టేట్స్ వ్యాపారులు ఇండ్లు, అపార్ట్‌మెంట్‌కు సంబంధించి అన్ని విషయాలు తెలుసుకునేలా ఒకే వేదికపై ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కొనుగోలుదారులకు ఈఎంఐ పద్ధతిలో రుణ సదుపాయం కల్పించడానికి బ్యాంకర్లు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ప్రభుత్వ అనుమతులు తీసుకున్న వారే ప్రదర్శనలో..
**ఎన్.సురేందర్ రావు, జనరల్ మేనేజర్, నమస్తే తెలంగాణ ప్రకటనల విభాగం**

ప్రాపర్టీషోలో అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకున్న సంస్థలు మాత్రమే ప్రదర్శనకు అనుమతించినట్లు నమస్తే తెలంగాణ ప్రకటన విభాగం జనరల్ మేనేజర్ సురేందర్‌రావు తెలిపారు. ఓపెన్ ప్లాట్స్, విల్లాలు, అపార్ట్‌మెంట్లు విక్రయించే సంస్థలన్నీ ఉన్నాయన్నారు. రూ. 20 లక్షల నుంచి ఓపెన్ ప్లాట్స్, రూ. 3 కోట్ల విల్లాల వరకు ఇక్కడ ప్రదర్శన ద్వారా కొనుగోలు చేయవచ్చన్నారు. ఇదే వేదికపై ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జాతీయ బ్యాంకులు తక్షణమే రుణ సదుపాయం అందించడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

### సులువుగా రుణ సదుపాయం
**ఎం.శ్రీకాంత్, రీజినల్ మేనేజర్, ఎస్‌బీఐ**

గృహ, వాణిజ్య, వాహనాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి సులభంగా రుణాలు అందిస్తున్నట్లు ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. తక్కువ వడ్డీతోనే మెరుగైన సేవలను వినియోగదారులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ప్రాపర్టీ షో ద్వారా స్థిరాస్తిని కొనుగోలు చేసే వారికి సులభంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ తరహాలో జరిగే కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించడం బాగుందన్నారు.

### నమస్తే తెలంగాణ ప్రయత్నం అభినందనీయం
**శంకర్ ఎబ్రామ్, రీజినల్ హెడ్, యూబీఐ**

మూడేండ్లుగా నిజామాబాద్ వేదికగా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉంటున్నాయని యూబీఐ రీజినల్ హెడ్ శంకర్ ఎబ్రామ్ అన్నారు. . మొన్ననే ఆటో షో ద్వారా జనాలకు చేరువయ్యామని, ఇప్పుడు ప్రాపర్టీ షోతో మరోసారి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రయత్నాల ద్వారా నగర వాసులకు ఎంతో మేలు చేకూర్చినట్లు అవుతుందన్నారు. ఇందులో తాము కూడా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ప్రాపర్టీ షోలో సందర్శకుల సందడి

అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్

### 28 ఎకరాల్లో ఓపెన్ ప్లాట్స్

28 ఎకరాల్లో మేడ్చల్ వద్ద హెచ్ఎండీఏ, ఆర్‌ఈఏఆర్ అప్రూవల్‌తో 22 వేల చ.అడుగుల వెంచర్ అందుబాటులోకి తెచ్చాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ తదితర అన్ని మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేశాం. విల్లాస్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే 70 శాతం విక్రయించాం. 30 శాతం మాత్రమే అందుబాటులో ఉంది.

**-భాస్కర్‌రెడ్డి, మేనేజర్, ప్రైమ్ ఎస్టేట్**

### అతి తక్కువ ధరలకే..

చందానగర్, మియాపూర్ ప్రాంతాల్లో అతి తక్కువ ధరలకే అపార్ట్‌మెంట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధర రూ. 48లక్షల నుంచి రూ.5.5 కోట్ల వరకు ఉన్నది.

**-శివ, సేల్స్ మేనేజర్, జీఆర్ బిల్డర్స్**

### కొంపల్లిలో 2బీహెచ్‌కే, 3బీహెచ్‌కే..

కొంపల్లిలో మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేవిధంగా 2 బీహెచ్‌కే రూ. 55 లక్షలు, 3 బీహెచ్‌కే రూ.65 లక్షల్లో ఫ్లాట్లను అందుబాటులోకి తెచ్చాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

**-శ్రీనివాస్ గౌడ్, మేనేజింగ్ డైరెక్టర్, గహన్ డెవలపర్స్**

### 328 ఫ్లాట్స్ ఉన్నాయి...

కొంపల్లి, గుండ్ల పోచమ్మ వద్ద 2బీహెచ్‌కే , 3 బీహెచ్‌కేతోపాటు 4, 5 బీహెచ్‌కేతో ఫ్లాట్స్ అందు బాటులో ఉన్నాయి. ప్రారంభ ధర రూ. 60 లక్షల నుంచి రూ.1.3 కోట్ల వరకు ఉంది. విశాలమైన, అందమైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి.

**-కృష్ణప్రసాద్, సేల్స్ మేనేజర్, గోల్డెన్ కీ ప్రైమ్ ప్రాపర్టీస్**

### ప్రాపర్టీషోలో ప్రత్యేక ఆఫర్..

కొంపల్లిలో నిజామాబాద్ హైవే నుంచి సినీ ప్లానెట్ పక్కన 1.3 కిలోమీటర్ల దూరంలో అపార్ట్‌మెంట్లు అందుబాటులోకి తెస్తున్నాం. 3. 1 ఎకరాల్లో 4 బ్లాక్‌లు, క్లబ్‌హెడ్, 2, 3 బీహెచ్‌కేతో మొత్తం 316 ఫ్లాట్స్ నిర్మిస్తున్నాం. వీటి ధర చ.అడుగుకు రూ. 5500 ఉండగా, ప్రస్తుతం ప్రాపర్టీషోలో ప్రత్యేక ఆఫర్ కింద రూ. 4900కే ఇస్తున్నాం.

**-గణేశ్, సేల్స్ మేనేజర్, వీజీ హోమ్స్**

### 9 ప్రాజెక్టులు ఉన్నాయి..

మా సంస్థ ద్వారా 9 ప్రాజెక్ట్‌లను కస్టమర్లకు తక్కువ ధరలకు అందుబాటులో తెచ్చాం. దూలపల్లి, గుండ్ల పోచంపల్లి, మేడ్చల్‌లో ఉన్నాయి. రూ. 2 బీహెచ్‌కే రూ. 60లక్షలు, 3 బీహెచ్‌కే రూ. కోటి వరకు వీటి ధర ఉన్నది.

**-విశ్వనాథ్‌రెడ్డి, సన్‌యుగ ఇన్‌ఫ్రా, మేనేజింగ్ డైరెక్టర్**

### 15 ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయి..

అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా 15 ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయి. 4 వెంచర్లు, 11 అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. మేడ్చల్, చేవెళ్ల, కొంపల్లి పరిసరాల్లో అపార్ట్‌మెంట్లు అందుబాటులో ఉన్నాయి. రూ. 83లక్షల నుంచి రూ. 8.5 కోట్ల ధర పలుకుతున్నాయి.

**-హితేశ్‌కుమార్, మేనేజర్, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్**

### మీ పెట్టుబడికి కచ్చితమైన ఆదాయం

మా సంస్థ ద్వారా 7 ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయి. వాణిజ్య సముదాయానికి సంబంధించి ఒక్క బిల్డింగ్‌లో పది అంతస్తులు ఉన్నాయి. 7, 8 ఫ్లోర్లతో 2లక్షల చదరపు అడుగులు, 4 సెల్లార్స్, 18 లిఫ్ట్‌లు, 1410 కార్ల పార్కింగ్ సదుపాయం ఉంది. 7 ప్రాజెక్ట్‌లు 52 లక్షల చ.అడుగులతో అందుబాటులో ఉన్నాయి. రెండు మినీ థియేటర్లు ఉన్నాయి. మీ పెట్టుబడికి కచ్చితమైన రిటర్న్స్ వస్తాయి.

**-ముత్యాల రమేశ్‌రెడ్డి, మేనేజర్, ఫేర్‌మౌంట్ మిడ్‌టౌన్**

### మధ్యతరగతికి అందుబాటులో.

కొంపల్లిలో ఎన్‌హెచ్-44ను ఆనుకొని మధ్య తరగతికి కుటుంబాలకు అపార్ట్‌మెంట్లను అందుబాటులోకి తెచ్చాం. 1935 చ.అడుగుల నుంచి 3425 చ. అడుగుల వరకు ఫ్లాట్లు ఉన్నాయి.

**-వేణుగోపాల్, సేల్స్ మేనేజర్, నార్త్‌క్రెస్ట్**

### 48లక్షల నుంచి కోటిన్నర వరకు..

కొంపల్లిలో మా సంస్థ నాలుగు ప్రాజెక్టులను నిర్వహిస్తున్నది. సామాన్యుడికి అందుబాటులో ఈ అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటి ధర రూ. 48 లక్షల నుంచి రూ. కోటిన్నర వరకు ఉన్నది.

**-పవన్ ప్రసాద్, సేల్స్ హెడ్, అమృత హోమ్స్**

### ఆరు ప్రాజెక్టులు ఉన్నాయి..

14 ఏండ్లుగా ఇండిస్ ద్వారా 6 ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చాం. మధ్య తరగతివారికి ధరలు అందుబాటులో ఉన్నాయి. టీసీపీఏ జంక్షన్, కూకట్‌పల్లి, బొల్లారం, కొండాపూర్, దుబ్బపల్లిలో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటి ధర రూ. 56 లక్షల నుంచి రూ. 3.5 కోట్ల వరకు ఉన్నది.

**-పూర్ణచందర్, సేల్స్‌హెడ్ (ఏజీఎం), ఇండిస్**

### సామాన్యుడికి అందుబాటులో అపార్ట్‌మెంట్లు

మా సంస్థ ద్వారా సామాన్యులకు అందుబాటులో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ప్రస్తుతం రెండు ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. గుండ్ల పోచంపల్లి వద్ద రూ.60 లక్షల నుంచి రూ. 75 లక్షల వరకు, గండిమైసమ్మ వద్ద రూ. 65 లక్షల నుంచి రూ. 90లక్షల వరకు ధర ఉన్నది.

**-గణేశ్, సేల్స్ మేనేజర్, వాసుశ్రీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్**

# కేసుల సత్వర పరిష్కారమే ధ్యేయం

**హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ**

2వ అదనపు ప్రథమ శ్రేణి కోర్టును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ

కామారెడ్డి, మార్చి 22: కేసుల సత్వర పరిష్కారమే అందరి ధ్యేయం కావాలని హైకోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా న్యాయస్థాన భవనంలో నూతన 2వ అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానాన్ని (కోర్టును)వర్చువల్ పద్ధతిలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి ఎస్.ఎన్. శ్రీదేవి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ, అడిషనల్ జిల్లా న్యాయమూర్తి లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి మాట్లాడుతూ.. కోర్టులకు వెళ్తే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కక్షిదారుల్లో కలిగేలా న్యాయవ్యవస్థ పనిచేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా న్యాయస్థానాల ఏర్పాటు ఆవశ్యకత కూడా పెరుగుతుందని తెలిపారు. కేసులు త్వరితగతిన పరిష్కారం కావాలని, ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉండడం మంచిదికాదని అన్నారు. న్యాయ వ్యవస్థకు బార్, బెంచ్ రెండు చక్రాల్లాంటివని, అవి సక్రమంగా పని చేస్తేనే కేసులు సత్వర పరిష్కారమై కక్షిదారులకు న్యాయం చేకూర్చిన వారమవుతామన్నారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ, న్యాయమూర్తులు కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టుహాలు, జడ్జి చాంబర్‌ను సందర్శించి పూజలు నిర్వహించారు. 2వ అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం జడ్జిగా జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దీక్ష, జిల్లా కోర్టు అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ వెంకట్ రెడ్డి, శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, చంద్రసేనారెడ్డి, న్యాయమూర్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాటలతో కాలం వెళ్లదీస్తున్న సర్కార్

**మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ**
**బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్**
**ఎల్లారెడ్డిలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం**

రామారెడ్డి, మార్చి 22: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలం వెళ్లదీస్తున్నదని బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విమర్శించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ ఫంక్షన్‌హాలులో శుక్రవారం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించగా.. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పూటకోమాట మార్చుతూ కాలం వెళ్లదీస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను నిలిపివేస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినా, నిరుత్సాహపడకుండా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుకోసం కష్టపడాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు. తాను గెలిస్తే ప్రజా సమస్యలపై పోరాడుతానని అన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, డైరెక్టర్లు, విండో చైర్మన్లు, రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

# బాలికతో వ్యభిచారం: ముగ్గురు నిర్వాహకుల అరెస్టు

కామారెడ్డి, మార్చి 22: ఓ బాలికతో పట్టణంలో వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కామారెడ్డి పట్టణంలో తల్లిదండ్రులు లేని ఓ బాలికను ఆమె చిన్నమ్మ వద్ద నుంచి సంపంగి లక్ష్మి, సుంకరి శంకర్ కొనుగోలు చేశారని చెప్పారు. సహజీవనం చేస్తున్న వీరు సదరు బాలికతో స్థానిక శ్రీనివాస్ లాడ్జిలో వ్యభిచారం చేయిస్తున్నారని తెలిపారు. లక్ష్మి, సుంకరి శంకర్‌తోపాటు లాడ్జి యజమాని నరసింహారెడ్డిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.